స్కెచి

# కోటి విద్యలు....

వల్లూరి కృష్ణారావు

రఘుపతి తెలివైనవాడు. మంచి సహనం ఉన్నవాడు కాబట్టే అంత సంసారాన్ని ఎలాగో అలాగ యీదుకు వస్తున్నాడు. రఘుపతి అందర్లాగ సాదాగా ఉంటే, ఏనాడో రఘుపతి సంసారం వీధిన పడేది రఘుపతి సంతానం కుచేలుని సంతానం. సంపాదన తక్కువ. ఖర్చు ఎక్కువ ఎలాగో తన ఖర్చుకు తన ఆదాయాన్ని ముడిపెట్టాలి సాధారణంగా ఆదాయాన్ని బట్టి ఖర్చును తలపెడ్తాము ఇందులో రఘుపతి ఏం చేయలేడు. తను చచ్చినట్లు తనకున్న ఖర్చుకు ఆదాయాన్ని పెంచుకోవాల్సిందే. అందుకే అనేక మార్గాలు అన్వేషించాలి తెలివిఉంది కాబట్టి వెంటనే అలవడ్డాయి అతగాడికి.

స్వతహాగా మంచివాడు ఆశ్రయించగల స్తోమత అతగాడికుంది ఇంకొహపెద్ద ఇదేమంటే.... పెద్ద మాటకోసం, అభిమానం కోసం పట్టింపులేదు. ఎదుటివాడిది తప్పయినా, తన తప్పుగా అనుకోమని 'క్షమించమని తడుముకోకుండా కోరగలడు. పైగా ఇవతలకొచ్చి ప్రక్కవాడితో "ఇందులో పోదూ... ఇదేముంది!" అంటాడు.

రఘుపతి తెల్లవారకుండానే లేచి రాత్రి ప్రొద్దుపోయేదాకా 'మెషీన్'లా పనిచేస్తాడు. ఏ గంటలో ఎక్కడుంటాడో అతన్ని తెలిసిన వారు ఇట్టే చెప్పగలరు. రఘుపతి ఒకోమాటు తనలో తాను అనుకునేవాడు.... "నేను వర్తి మెకానికల్".

ఉదయం ఏ డవకుండానే పిల్లలు వస్తారు. తన వీధిఅరుగు ఒక చిన్నబడి. పిల్లలు అనేక తరగతుల వారుంటారు. వారందరితో రఘు అష్టావధానం చెయ్యాలి అందులో అనేక వర్గాల పిల్లలుంటారు వారందరిని ఉచితరీతిని చూస్తూ, వారివారికి చెప్పే రీతుల్లో చెప్పాలి. పెదనాయుడుగారి అబ్బాయి పాఠం తానే చదివి పెట్టాలి అతడు చదవడు. రఘుపతి చదివిపెడ్తాడు పాపం చౌదరిగారి బుల్లి మనమడు అ, ఆ లు వ్రాయలేడు. రఘుపతే వ్రాయాలి రాజుగారి పెద్దకొడుక్కు లెక్కలు జాగ్రతగా చెప్పాలి చిన్నయ్యగారి చిన్నఅబ్బాయికి కాగితం పడవచేసి సైడు కాలవలో ఒదిలి వాడికి చూపించాలి చాకలి రత్తికొడుకు నంటాడు ఇంతలో. "గమ్మున ఆ నీళ్ళు తోడిరా.... వెధవ సన్యాసీ!" రఘుపతి ఎవరి దగ్గర ఎలా మసలాలో అతడికి ఉగ్గుతో నేర్పిన విద్యలా తోస్తుంది పిల్లలకు కూడా తెలుసు. ఎవరంటే భయమో, ఎవరంటే గౌరవమో, ఎవరంటే లోకువో!

ఇంతలో గవర్నమెంటు డాక్టరుగారి అమ్మాయి రోజూ వస్తుంది, రెండు జళ్ళు వేసుకొని రెపరెపలాడుతూ! రఘుపతి పెద్దగా నవ్వుతూ... "ఆఁ వస్తున్నావా! రా రా!....ఆఁ నాన్నగారు ఏం చేస్తున్నారు?"

"ఎవరికో ఇంజక్షను చేస్తున్నారు."

"ఇంజక్షనా!"

'ఇంజక్షన్' అంటే రఘుపతి మెదడు ఇంక పనిచెయ్యదు. ఎలా అయినా తానా విద్యను కరతామలకం చేసుకోవాలి. అసలు ఈ హోమియోపతి అన్నా ఆయుర్వేదం అన్నా చచ్చినా నమ్మకం లేదు. తాను ప్రజలకి నమ్మకం కలిగించాలంటే తాను కూడా సూది మందివ్వాలి. అందుకు నేర్చుకోవాలి 'ఇన్నేళ్ళొచ్చాయి చదువుకోక మన్ను కొట్టుకోనా' అన్నా సరే! రఘుపతి అలా ఉన్నాడుగాని అతడు లౌకికుడు. బ్రహ్మాండమైన లౌకికం గల లౌకికుడు. 'డే టు డే మార్కెట్టును' పరిశీలించి

అర్థం చేసుకొని, వస్తువును మార్కెట్టులో దింపే మంచి వ్యాపారస్థుడు. డాక్టరుగారి అమ్మాయికి ప్రవేటు చెప్పతున్నాడంటే అందులో అర్థంలేక కాదు. వెధవ రెండు రూపాయల కాసించి కాదు, తాను ఆ ప్రెవేటు కోసం ప్రాధేయపడత. అందులో వంద వేరే అవకాశాల కోసమే! రోజా ప్రవేటు మూలాన.... ఆ గవర్నమెంటు డాక్టరికి రఘుపతంటే అభిమానం ఉంటుంది. అంచేత....తను కాంపిటేషన్' లేని 'మొనాపలిస్టు' అవుతాడు ఇక రెండోది....ఏదో ఆశ్రయించి....అలా....అలా ఎల్లోపతి, కాస్త మందును నూదిలోంచి పంపే నిపుణత్వం కూడా నేర్చుకున్నాడంటే.... మూడు రకాలని మేళవించి తాను వైద్యం చేసి చూపెడితే....తన ప్రతిభ, సంపద అంచులు దాటుతై!

చాకలి రత్తి కొడుకును ప్రవేశపెట్టుకోవడంలో కూడా ఏదో ఒక ప్రయోజనం సాధించే ఉద్దేశం ఉండకపోదు. అసలే రఘుపతి భార్య రోగిష్ఠిది. పిల్లలతో చేసుకోలేదు వెధవది బాల్చీడు నీళ్ళయినా తోడిస్తాడు ఈ కుర్ర వెధవ. అందుకే రత్తితో చెప్పాడు, "వాణ్ణలాగ తగలేస్తావ్. నువ్వు చేస్తున్నావుగా పని. వాడికి శుభ్రంగా చదువు చెప్పించవే." చాకలి రత్తికి ఎంతగానో నచ్చాయి రఘుపతి మాటలు.... పధ్నాలుగేళ్లు వచ్చిన కుర్రాడు అ, ఆ లు మొదలుపెడితే, భార్యకాపరాని కొచ్చినా, చదువు నాల్గవ పుస్తకం దాటదని రత్తి కేం తెలుసు? తెలిసిన రఘుపతి మరి తన ప్రయోజనం కోసం ఏదో అనక తప్పదు, నౌకరును పెట్టించుకొనే సితి తనకు లేదు.

ఇంతలో ఎవరో మందుకో మాకుకో వస్తూ పోతూ ఉంటారు వాళ్ళందరి రోగాలూ జాగ్రత్తగా విని మందును పొట్లాల్లోకట్టి....వాటి యొక్క విలువని, గొప్పతనాన్ని అంతంతగా పొగుడుతూ, రోగికి హితువుగా ఉండే ఆహారాన్ని చెప్పతూ సాగనంపుతాడు. రఘుపతి ఓర్పుకు పెట్టిందిపేరు. అసలు డాక్టరనేవాడికి ఎంతో ఓర్పు అవసరం. అది రఘుపతికి ఎంతగానో ఉంది.

పది కొట్టగానే స్కూలుకు పైమీద కండువా వేసుకొని పోతాడు. మధ్యాహ్నం యిచ్చే కాళీ సమయంలో 'రౌండు'కు పోయి కేసులు చూసుకుంటాడు. రోగికి రఘుపతి ఎంతగానో దగ్గరగా కనపడ్డాడు.

"కాళ్ళు లాగుతున్నాయి మాష్టారూ!"

అక్కడే వస్తుంది రఘుపతికి....డాక్టరుగారూ అనకూడదు? వెధవలవాటు!! రఘుపతి ఏ విషయంలోనూ నోరుజారడు. ఆముదాన్ని తేనెలా మింగుతున్నట్లు మొహం పెట్టగలడు.

"అవును బాబూ! జ్వరం వచ్చిందా మరి· రెండు లంఘణాలు....లాగుతాయి. ఆనక నాన్నచేత 'నొప్పల హరి' రెండు పొట్లాలు కట్టిస్తాను రేపు నడవాలని ఉంది మాష్టారూ అంటావు నువ్వే!"

"కాఫీ వద్దు మాష్టారూ! త్రాగలేను."

"కాసిన్ని పాలు పుచ్చుకో"

"అదీ ఒద్దండి... పాలు నాకు పడవు."

"కాస్త పల్చగా సగ్గుజావా?"

రోగి మాట్లాడ్డు....'అరి నీ తస్సా బోడ్డూ! ఆ! ఆ! సరే....రోజులు మారాయయ్యా! రోగి చెప్పినట్లు వినాలి. ఆ! వస్తాను"

అలా ఇవతలికి వచ్చేస్తాడు.

సాయంత్రం నాలుగు మెతుకులు నోట్లో వేసుకుంటాడో లేదో...."తలుపేసుకో!" అని ఒక చిన్న కేకేసి బయటకు చకచక నడుస్తాడు. రఘుపతి జోడు చప్పుడు వినగానే ఆ ఇంటమ్మాయి 'హారిమనీ' పెట్టె తీసుకొని వీధి అరుగు మీదకు వచ్చి కూర్చుంటోంది. రఘుపతికి ఈ విద్య సరిగా అంటలేదు. అయినా కృషిలో లోపం లేదు. కొంచం కంఠం దగ్గుపట్టిన గొంతు మాదిరిగా ఉంటుంది. అయినా ప్రవేట్లకు పోటీలేదు.

సంగీత కార్యక్రమం అయ్యాక అలా శేషాచలం కొట్టుకు పోయి ఒకమాటు అతగాణ్ణి చూస్తాడు. శేషాచలం పద్దు పుస్తకాలు ఇతని ముందు పారేస్తాడు. ఏవో ఇంకో పుస్తకంలోకి ఎక్కిస్తూ "ఇవ్వేళ అమ్మకాలు అట్టే బాగుండ లేదు."

(తరువాయి 42-వ పేజీలో)